## క్లుప్తంగా

### ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(బృందావనం): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని 9వ డివిజన్ నవాబుపేట బాబామియా మసీదులో వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి ఎం.డి.ఖలీల్ అహ్మద్ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, షేక్ కరీముల్లా, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హంజాహుస్సేనీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరా మొహిద్దీన్, నాయకులు అలీం, షేక్ అబ్దుల్‌సలాం తదితరులు పాల్గొన్నారు.

### మనుబోలమ్మకు స్వర్ణ కవచాల బహూకరణ


స్వర్ణ కవచాల అలంకరణలో మనుబోలమ్మ


మనుబోలు : మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మకు దాతలు స్వర్ణ కవచాలను సోమవారం బహూకరించారు. గ్రామానికి చెందిన చెన్నూరు కోదండరామిరెడ్డి- అనసూయమ్మ, సునీల్-అజిత దంపతులు సుమారు రూ.2 లక్షల విలువ చేసే స్వర్ణ కవచాలను చేయించి అమ్మవారికి ఇచ్చారు. అర్చకుడు సాయిశర్మ మనుబోలమ్మకు మంత్రోచ్చారణల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వర్ణ కవచాలను అమ్మవారికి అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

### 21 నుంచి పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేకాలంకరణలో స్వామి అమ్మవార్లు(ఫైల్)

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణి సమేత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగుతాయని గ్రామ భక్తజన బృందం వారు వెల్లడించారు. తొలిరోజు ఉదయం అఖండ దీపారాధన, స్వామివారికి పంచామృతాభిషేకం, ధ్వజారోహణ, హోమం, పల్లకిసేవ, హరేరామ భజన ఉంటుందన్నారు. 22న గరుడసేవ, గ్రామోత్సవం, 23న స్వామి అమ్మవార్ల కల్యాణం, గిన్నెబిక్ష గ్రామోత్సవం, 24న పాండురంగస్వామి అగ్నిగుండ ప్రవేశం, 25న వసంతోత్సవం, ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని తెలిపారు.

### ఆన్‌లైన్ నమోదు పక్కాగా జరగాలి


మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ డీపీఎంఓ రమేష్

కోవూరు : పీహెచ్‌సీల్లో గర్భిణులకు అందించే వైద్యం వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ డీపీఎంఒ రమేష్ తెలిపారు. మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది, సూపర్‌వైజర్లతో ఆయన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎంఒ రమేష్ మాట్లాడుతూ గర్భం దాల్చిన యువతి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బాలింతలు, శిశువుల వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేయడమే కాకుండా వారికి సంబంధించిన వైద్య పరీక్షల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎం మంజుల, వైద్యాధికారి డాక్టర్ నిరంజన్, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

# బకాయిదారుల కుళాయి కనెక్షన్లు తొలగించండి


మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్


హాజరైన రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరంలో కుళాయి పన్ను చెల్లించని మొండి బకాయిదారులను గుర్తించి వారి మంచినీటి సరఫరా కనెక్షన్లు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన సమావేశ మందిరంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరవ్యాప్తంగా నిరంతరం మంచినీటి సరఫరా నిర్వహణ నిమిత్తం పన్నులను బాధ్యతగా చెల్లించి ప్రజలంతా సహకరించేలా అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి, ఖాళీస్థలం పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, 2023-24 రెండో అర్ధ సంవత్సరం వరకు పన్నులపై విధించిన అపరాధ రుసుము(వడ్డీ)ను ఏక మొత్తంలో చెల్లింపుతో వడ్డీ మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని మార్చి 31వ తేదీలోపు ఏక మొత్తంలో చెల్లించినట్లయితేనే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ మినహాయింపు లబ్ధి పొందాలని సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పన్నుల వసూలు కౌంటర్‌తోపాటు నగరవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చునని తెలిపారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా, నెట్ బ్యాంకింగ్, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా కూడా పన్నులు చెల్లించవచ్చన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ సంపత్‌కుమార్, రెవెన్యూ అధికారులు సమ్మద్, శ్రీనివాసులు, రాజేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి ఓటు పునాది


నిడిగుంటఅరుణను సేవా రత్న పురస్కారంతో సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ప్రజాస్వామ్యానికి ఓటు పునాది అని, ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని పలువురు వక్తలు సూచించారు. కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో అరిగెపూడి విజయకుమార్ సౌజన్యంతో ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు పురమందిరంలో ఆదివారం రాత్రి 'ఓటు విలువ తెలుసుకో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు వీరిశెట్టి హజరత్‌బాబు, మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, వాకాటి విజయకుమార్ రెడ్డి, పి.ప్రదీప్, షేక్ రియాజ్, ఎన్.సత్యం తదితరులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు ద్వారా ప్రజలు తమ ఉజ్వల భవిత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిడిగుంట అరుణను సేవారత్న పురస్కారంతో ఘనంగా సత్కరించారు. పాటలు, నృత్య పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన ఔత్సాహిక కళాకారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. శ్రీబాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరిలో సీనియర్ గాయకులు సుజాత, రఫీ, కిషోర్, మోజెస్ పాత, కొత్త పాటలతో అలరించారు.

## రేపు పెన్షనర్ల సమావేశం

నెల్లూరు(అర్బన్): ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వర్ధమాన సమాజం కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.లక్ష్మీనారాయణ, వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ సభ్యులు ఈ సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

# హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక చికిత్స

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): అధిక రక్తపోటు, మధుమేహం, రక్తహీనత లాంటి సమస్యలున్న హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్యం అందేలా అధికారులు, వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య రక్షణపై సోమవారం సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సంబంధిత సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ హైరిస్క్ ఉన్న గర్భిణులకు మంచి పోషకాహారం అందించడం, నెలనెలా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించడం, తగిన మందులు అందజేయడం లాంటివి పక్కాగా చేయాలని సూచించారు. సకాలంలో వైద్యసేవలందించడం ద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టవచ్చన్నారు. క్లిష్టమైన గర్భిణి కేసులను జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి, నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, డాక్టర్ కిరణ్, సెలీనాకుమారి, డాక్టర్ పవన్‌రెడ్డి, డాక్టర్ కావ్య, డెమో అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# గిరిజనుల అభ్యున్నతికి ఆదాల కృషి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నెల్లూరు సిటీ: గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్‌లోని కొమ్మరపూడి పంచాయతీ గిరిజనకాలనీలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన 9 నెలల కాలంలో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. రూరల్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆదాలకే తమ ఓటు అని గిరిజన ప్రజలు చెబుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనంలో తెలుగుదేశం పార్టీ కొట్టుకుపోతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అరవ కామాక్షమ్మ, బెల్లంకొండ వెంకయ్య, మేలింగి పాల్, అరవమని బిల్లు నాగలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, నందిని మురగవల్లి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో నూతన భవనం ఏర్పాటు


వెల్లంపల్లి భాస్కరరావును సన్మానిస్తున్న అసోసియేషన్ నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కోసం త్వరలో నూతన భవనం ఏర్పాటు చేయనున్నామని ఆ అసోసియేషన్ నెల్లూరు అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. నగరంలోని ఆచారివీధిలో ఉన్న నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నెల్లూరు నగర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతానికి మరింత కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, నిపుణులైన వైద్యుల ద్వారా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఆదివారం ప్రముఖ చెవి, గొంతు, ముక్కు వ్యాధుల నిపుణులు డాక్టర్ ఎస్.రాజేష్‌కుమార్ సీనియర్ సిటిజన్స్‌కు చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై అవగాహన కల్పించారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, బయ్యా వాసు, సీనియర్ సిటిజన్ వెల్లంపల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# కిమ్స్‌లో ఐవీఎల్ ప్రొసీజర్ విజయవంతం


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరాజు తదితరులు

నెల్లూరు(అర్బన్): గుండె కరోనరీ ఆర్టరీ రెండు బ్లాకులు కాల్షియంతో నిండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఓ పేషంట్‌కు ఐవీఎల్ అనే అధునాతన చికిత్స చేసి ప్రాణాలు కాపాడామని కిమ్స్ స్పెషాలిటీ హాస్పిటల్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. కోలుకున్న రోగితో కలిసి సోమవారం దర్గామిట్టలోని కిమ్స్ ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా గుడిమెల్లపాడుకు చెందిన 75 ఏళ్ల రోగికి గుండెనొప్పి రావడంతో ఒంగోలులో యాంజియోగ్రామ్ చేయించుకున్నాడని తెలిపారు. ఈ నెల 14న రోగి నెల్లూరులోని కిమ్స్ ఆస్పత్రికి వచ్చాడని, గుండె కరోనరీ ఆర్టరీ బ్లాకుల్లో ఉన్న అధిక కాల్షియం తొలగించాలంటే బైపాస్ సర్జరీ తప్పదని తెలిపామన్నారు. వయస్సు రీత్యా ఆపరేషన్ లేకుండా కేసును ఛాలెంజ్‌గా తీసుకుని ఐవీఎల్(ఇంట్రావ్యాస్క్యులర్ లిథోట్రిప్సి) అనే నూతన ప్రక్రియ ద్వారా బ్రేక్ చేసి స్టంట్స్ వేశామని తెలిపారు. మెట్రో నగరాలకు మాత్రమే పరిమితమైన ఇలాంటి అరుదైన ప్రొసీజర్‌ను నెల్లూరులో తొలిసారిగా చేపట్టి విజయవంతం చేశామన్నారు. సమావేశంలో ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ సతీష్‌కుమార్, అనస్తీషియన్ డాక్టర్ నరేష్, ఆస్పత్రి ఈడీ గిరినాయుడు, కార్డియాలజీ డాక్టర్లు పాల్గొన్నారు.

# బుచ్చిలో కేంద్ర బలగాల కవాతు


బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో కేంద్ర బలగాలు సోమవారం కవాతు చేపట్టాయి. పలువీధుల్లో తిరుగుతూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రజలకు తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాలు, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సీఐ హైమారావు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నను మరోసారి గెలిపించుకుందాం


27వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఆ పార్టీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్, సావిత్రినగర్, చంద్రమౌళినగర్ తదితర ప్రాంతాల్లో డివిజన్ ఇన్‌చార్జి సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు తమ ఓటు ఫ్యాన్ గుర్తుకేనని ప్రజలు తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మల్లెబోయిన వెంకటేశ్వరయాదవ్, ఇన్‌చార్జి షేక్‌బాబు, 26, 27 డివిజన్ల సచివాలయ కన్వీనర్లు సురేంద్రరెడ్డి, సందీప్, శ్యామ్‌సింగ్, కృష్ణ, గంగిరెడ్డి, సందాని, పెంచలయ్య, నాయకులు విజయ్‌రెడ్డి, వెంకటరమణయ్య, సాగర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**22వ డివిజన్‌లో..**

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 22వ డివిజన్‌లోని రాజుకాంప్లెక్స్‌లో నాయకులు సోమవారం ఇంటింటికీ మొక్కలు అందిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీఆర్ ఆర్మీ కమిటీ సభ్యులు వైవీరెడ్డి, శ్రీధర్‌బాబు, మైపాడు అల్లాబక్షు, ఇక్బాల్, పద్మజయాదవ్, షాలిని, శైలజయాదవ్, ఆదిలక్ష్మి, అనితరెడ్డి, వినోద్, జిమ్ వంశీ, నరసింహారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**28వ డివిజన్‌లో..**

స్థానిక 28వ డివిజన్‌లోని న్యూ మిలటరీ కాలనీలో సోమవారం డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామంటూ కరపత్రాలు పంపిణీ చేశారు.

**38వ డివిజన్‌లో..**

డివిజన్‌లోని ఫత్తేఖాన్‌పేట ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి అమృత, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కోఆర్డినేటర్ సునందతోపాటు పలువురు మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


22వ డివిజన్‌లో..


28వ డివిజన్‌లో..


38వ డివిజన్‌లో..

## సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్

వెంకటాచలం : విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్ బాబు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాల గురించి ఆలోచన చేయాలన్నారు. తరగతి గదుల బయట నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగంలో ఉంటే అన్ని విషయాలు పూర్తిస్థాయిలో తెలుసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ అధికారి విద్యా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రోత్సాహకం.. వైద్య సహాయం


విద్యా ప్రోత్సాహకం అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ లక్ష్మీనృసింహనాథ నాదేంద్ర స్వామి ఆరాధన ఉత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ప్రోత్సాహక, వైద్య సహాయక, వృద్ధాశ్రమ నిర్వహణకు సంబంధించి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వివిధ పీఠాలు, ఆశ్రమాలు, సంఘాల నిర్వాహకులు రామాయణం మహేష్‌స్వామి, సుఖపతికానంద మహరాజ్‌స్వామి, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ అధ్యక్షుడు పారా వేంకటశ్రీధర్‌శర్మ, ధూళిపాళ నాగరాజుశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గత నాలుగు నెలల వ్యవధిలో 20 మంది విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకాలుగా రూ.2 లక్షలు అందజేసినట్లు తెలిపారు. ఆ ట్రస్ట్ మేనేజర్ సమయానందనాథస్వామి మాట్లాడుతూ ప్రవాస భారతీయుల దాతృత్వం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మీనరసింహారావు, మైపాడు రాజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిపై ప్రత్యేక దృష్టి


పోస్టర్ల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఈఓపీఆర్డీ డేవిడ్

కొడవలూరు: కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల నియమావళిపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నారు. ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ వి.డేవిడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించి ఆయా పంచాయతీ కార్యదర్శుల సహకారంతో రాజకీయ పార్టీల పోస్టర్లు, హోర్డింగ్‌లు తొలగింపజేశారు. మతపరమైన పోస్టర్లపై రాజకీయ నేతల ఫొటోలుంటే వాటినీ తొలగించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లోని రాజకీయ పార్టీల పోస్టర్లు, హోర్డింగ్‌లు తొలగించాలని పంచాయతి కార్యదర్శులను ఆదేశించామన్నారు. నేతల విగ్రహాలకు సైతం ముసుగులు వేశామని వివరించారు.

# మద్యం దుకాణంలో చోరీ యత్నం

సంగం: సంగం బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ యత్నం జరిగింది. దుండగులు మద్యం దుకాణం షట్టర్ పగలగొట్టి లోపలికి ప్రవేశించే సమయంలో వాచ్‌మెన్ అప్రమత్తమవడంతో దుండుగలు ఇన్నోవా కారులో పరారయ్యారు. చోరీ యత్నం సమయంలో షాపులో రూ.5.50 లక్షల నగదు ఉందని సిబ్బంది తెలిపారు. చోరీ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు.

## ఎన్నికల నియమావళి పాటించాలి

కొండాపురం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని అధికారులు ఎన్నికల నియమావళి పాటించాలని తహసీల్దార్ ఆర్.మస్తానయ్య అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉంటే వెంటనే తొలగించాలన్నారు. నాయకుల బొమ్మలకు ముసుగులు వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుజాత, రెవిన్యూ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.